ఈనాడు శ్రీకాకుళం

శుక్రవారం సెప్టెంబరు 27, 2024 7

అనుకోకుండా ఒకరోజు..!

- సిక్కోలులో మంత్రి నారా లోకేశ్ ఆకస్మిక పర్యటన
- జోరు వానలో నగరపాలక సంస్థ పాఠశాల తనిఖీ

రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మధ్యాహ్నం 1.20 గంటలకు శ్రీకాకుళం నగరానికి చేరుకున్నారు. వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ఫోన్ చేసి పాఠశాల చిరునామా చెప్పి అక్కడికి వస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం తెలియగానే అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఆ పాఠశాలకు ఎందుకు వెళ్లారు? తర్వాత ఎక్కడికి వెళ్తారోనని ఉత్కంఠగా గడిపారు. మధ్యాహ్నం 1:45 గంటలకు జోరు వానలో ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి ఎచ్చెర్ల వారి వీధిలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. రెండు గంటలకుపైగా అక్కడే ఉండి.. అనంతరం వెనుదిరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. –ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

చేతి రాత బాగుందే..

1 నుంచి 5వ తరగతి విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. మీకు ఇష్టమైన సబ్జెక్టు ఏంటి? మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుంది? అమ్మా, నాన్న ఏం చేస్తుంటారు? ఏకరూప దుస్తులు, సంచులు బాగున్నాయా? అని ఆరా తీశారు. చిన్నారుల పుస్తకాలను పరిశీలించి చేతి రాత బాగుందని ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు.


ఎచ్చెర్ల వారి వీధి పురపాలక పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తూ..

అల్లరి చేయండి.. బాగా చదువుకోండి..

కొందరు విద్యార్థులను వస్తువుల పేర్లను ఆంగ్లంలో అడిగి తెలుగులో సమాధానాలు రాబట్టారు. ఆ సమయంలో ఓ బాలిక 'సార్.. అబ్బాయిలు తరగతి గది తలుపు విరగొట్టారు' అని చెప్పగా మంత్రి స్పందించారు. 'మీరు రౌడీల మాదిరి ఉన్నారురా' అని చమత్కరించారు. చిన్నప్పుడు తాను కూడా అల్లరి చేసేవాడినని చెప్పారు. అల్లరి చేయడంతో పాటు బాగా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు బెంచీలు సమకూర్చాలని కోరగా త్వరలోనే ఏర్పాటు చేయిస్తామన్నారు. 5వ తరగతి విద్యార్థులు అర్జున్, దశరథ లోకేశ్, ఎమ్మెల్యేలను ఆటోగ్రాఫ్ అడిగి తీసుకున్నారు.


బాలుడికి ఆటోగ్రాఫ్ ఇస్తూ..

ఉపాధ్యాయులతో సమీక్ష

అనంతరం మంత్రి లోకేశ్ ఉపాధ్యాయులు, ఎంఈవో, సిబ్బందితో సమావేశమయ్యారు. పాఠశాలలో 80 మంది విద్యార్థులకు రెండు గదులే అందుబాటులో ఉన్నాయని, కొన్ని శిథిలావస్థకు చేరాయని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నాడు-నేడులో నిధులు మంజూరు చేయలేదని, సొంతంగా రూ.50 వేలు ఖర్చు చేసి మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. వర్షం పడితే తరగతి గదుల్లోకి నీరొచ్చేస్తోందని వివరించారు. జీతం సక్రమంగా అందడం లేదని ఆయా చెప్పగా సమస్య తలెత్తకుండా చూడాలని ఎంఈవోను ఆదేశించారు. అనంతరం పలువురు స్థానికులతో కలిసి ఫొటోలు దిగి.. విశాఖపట్నం బయలుదేరారు. ఆయన వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తదితరులు ఉన్నారు.


ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేశ్

కుండపోత


శ్రీకాకుళం నగరంలో వన్‌వే ట్రాఫిక్ రహదారిపై నిలిచిన నీరు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం చిన్న చినుకులతో ప్రారంభమై కుండపోతగా మారింది. సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో శ్రీకాకుళం నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. శ్రీకాకుళం మండలంలో అత్యధికంగా 31.75 మి.మీ., కవిటిలో అత్యల్పంగా 1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వర్షపాతం ఇలా..	(మి.మీ.లలో)
ఎచ్చెర్ల	27.25
నరసన్నపేట	20.75
ఆమదాలవలస	19.75
సంతబొమ్మాళి	19.25
ఇచ్ఛాపురం	17.75
టెక్కలి	17
హిరమండలం	15.5
నందిగాం	15
కంచిలి	13.5
పలాస	11.75
రణస్థలం	10.25

100 రోజుల్లో పాలన గాడిలో పెట్టాం

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రాష్ట్ర ప్రగతి అంధకారంలోకి వెళ్లిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే పాలన గాడిలో పెట్టామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. భోగాపురం విమానాశ్రయం, మూలపేట పోర్టు నిర్మాణాలతో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, మరో నెల రోజుల్లో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వరదలు, తుపానులు విరుచుకుపడిన ప్రతిసారి పలాస నియోజకవర్గంలోని పూడిలంక గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులపై ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా నిర్లక్ష్యంతోనే నువ్వలరేవు వద్ద బ్రిడ్జి పనులు పూర్తి కాలేదని, ఈ ప్రాంతంలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్ మంజూరైతే జెట్టీ నిర్మిస్తామని మాజీ మంత్రి అప్పలరాజు మత్స్యకారులను మోసం చేశారని మండిపడ్డారు. ఇవన్నీ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ రావాలి.. ఆ పర్యాటక శోభ..!

పక్షుల కిలకిలారావాలు ఓ వైపు.. ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రాలు మరో వైపు.. సువిశాల సాగర తీరం.. చరిత్రలో సజీవంగా నిలిచిపోయిన కట్టడాలతో సిక్కోలు అనేక పర్యాటక ప్రాంతాలకు ఆలవాలంగా ఉండేది.. వైకాపా ఐదేళ్ల పాలనలో ఈ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడంతో కళ తప్పింది. సందర్శనీయ ప్రాంతాలన్నీ సమస్యలు సుడిగుండంలో చిక్కుకున్నాయి. గతంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వం జిల్లాలో పర్యాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని అంతా కోరుతున్నారు. నేడు 'అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం... – ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

పక్షుల విడిది కేంద్రాలు.. గాలిలో దీపాలు..


2021లో అంతుచిక్కని వ్యాధితో మృతిచెందిన పెలికాన్ పక్షులు

టెక్కలి మండలం తేలినీలాపురం, ఇచ్ఛాపురం మండలంలోని తేలుకుంచి గ్రామాలు విదేశీ పక్షుల విడిది కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. ఏటా ఇక్కడికి సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సైబీరియా నుంచి విహంగాలు వస్తుంటాయి. గతంలో తెదేపా ప్రభుత్వం రెండు చోట్ల అభివృద్ధి పనులు చేపట్టింది. తేలినీలాపురంలో పక్షుల జీవన విధానాన్ని ఆకృతులతో వివరించే ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. పగోడాలు నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు. వైకాపా ప్రభుత్వం నిర్వహణను గాలికొదిలేయడంతో పర్యాటకులు అసౌకర్యానికి గురవుతున్నారు. పరిసరాలు అధ్వానంగా మారాయి. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం, ఇచ్ఛాపురం గ్రామీణం



జిల్లాలో 193 కి.మీ. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. అరసవల్లి సూర్యదేవాలయం, శ్రీముఖలింగం, శ్రీకూర్మం ఆలయాలతో పాటు ప్రసిద్ధి చెందిన శాలిహుండం బౌద్ధ క్షేత్రాలను గత వైకాపా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. టెక్కలిలోని తేలినీలాపురం, ఇచ్ఛాపురం తేలుకుంచి విదేశీ పక్షుల విడిది కేంద్రాల అభివృద్ధినీ గాలికొదిలేశారు. 2014-2019 మధ్యలో అప్పటి తెదేపా ప్రభుత్వం పర్యాటక శాఖకు ఏటా రూ.2 కోట్ల చొప్పున ఐదేళ్లలో సుమారు రూ.10 కోట్ల వరకు కేటాయించింది. వైకాపా సర్కారు ఉన్నంతకాలం ఒక్క రూపాయి ఇవ్వలేదు.


కోతకు గురైన కళింగపట్నం బీచ్ రహదారి

కళావిహీన తీరం..

తెదేపా హయాంలో కళింగపట్నం సాగరతీరంలో సందర్శకులను ఆకర్షించేందుకు బుద్ధుని విగ్రహం, సహజత్వం కనిపించేలా వన్యప్రాణుల ఆకృతులు, సందర్శకులు సేదతీరేందుకు గ్రానైట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఏటా పర్యాటక దినోత్సవం నిర్వహణతో పాటు నిత్యం సందర్శకులు తాకిడి ఉండేది. వైకాపా సర్కారు వీటి అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు.

ప్రగతి దిశగా అడుగులు..


తెదేపా హయాంలో కళింగపట్నం తీరం వద్ద బుద్ధుడు, జంతువుల ఆకృతుల వద్ద సందర్శకులతో నిండిన తీరం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పడకేసిన పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు అడుగులు వేస్తోంది. జిల్లావ్యాప్తంగా 11 మండలాల్లో ఉన్న 67 బీచ్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. శ్రీకాకుళం గ్రామీణం మండలం పెదగనగళ్లవానిపేట తీరం అభివృద్ధికి రూ.67.50 లక్షలు, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివ సాగర తీరాని రూ.కోటి, కళింగపట్నంలో వాటర్ స్పోర్ట్స్‌కు రూ.33 లక్షలు, శాలిహుండంలో రిసార్టు నిర్మాణానికి రూ.70 లక్షలు అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించారు. వాటిని ఉన్నతాధికారులకు నివేదించినట్లు జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు తెలిపారు.

ఆదర్శ స్మారకాన్నీ వదిలేశారు..

శాలిహుండం బుద్ధుని కొండ ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆదర్శ స్మారకంగా ప్రత్యేక గుర్తింపును మూడేళ్ల కిందట ఇచ్చింది. ఇక్కడికి సుమారు మరో 6 కి.మీ. దూరంలో కళింగపట్నం పంచాయతీ నగరాలుపేట సమీపంలో మరో బౌద్ధ స్తూపం ఉంది. దీంతో చూసేందుకు నిత్యం సందర్శకులు వస్తుంటారు. శాలిహుండం బుద్ధుని కొండ పైన పుస్తక శాల, ఫలహారశాల, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు కానీ అందుబాటులోకి తీసుకురాలేదు. – న్యూస్‌టుడే, గార


శాలిహుండం బౌద్ధ క్షేత్రం

కొండే మిగిలింది..

ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీలోని తెప్పరేవు సమీపంలో నాగావళి నదికి ఆనుకొని 58.80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండను పర్యాటక కేంద్రంగా మార్చాలని గత తెదేపా ప్రభుత్వం ప్రణాళిక వేసింది. అందులో భాగంగా ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి 5, శిల్పారామానికి 9.75, ఏపీ పర్యాటకశాఖకు 17.1, అంబేడ్కర్ శిక్షణ సంస్థకు 5 ఎకరాలు కేటాయించారు. కానీ గత ఐదేళ్లలో ఒక్క సంస్థ కూడా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల


అభివృద్ధికి నోచుకోని పొన్నాడ కొండ

చిరుప్రాయం.. చూపు అస్పష్టం..!



పిల్లల్లో రోజురోజుకు పెరుగుతున్న కంటి సమస్యలు

బావి పౌరుల చూపు మందగిస్తోంది. చిన్న వయసులోనే దృష్టి లోపాలు వెలుగు చూస్తున్నాయి. చాలా మంది పిల్లలు ఉదయం లేచినప్పటి నుంచి కళ్లద్దాలు లేకపోతే ఏ పని చేయలేని పరిస్థితి నెలకొంటోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రస్తుతం కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 61,494 మందిని పరీక్షించగా వారిలో 7 శాతం మంది నేత్ర సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నట్లు తేలింది. – న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)

బడి పిల్లలో దృష్టిలోపాలు గుర్తించి కళ్లద్దాలు ఇవ్వాలని, అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైకాపా సర్కారు నిలిపివేసిన కార్యక్రమాన్ని పునఃప్రారంభించింది. ఆ మేరకు మొదటి విడతలో 672 ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు 95,566 మంది విద్యార్థులకు పరీక్షలు చేయాలని నిర్ణయించారు. 'స్కూల్ హెల్త్ ఆఫ్ ఐ స్క్రీనింగ్' పేరుతో ఆగస్టు నుంచి ఆప్తాల్మిక్ అధికారులు కార్యక్రమం కొనసాగుతోంది.


సంతబొమ్మాళిలో విద్యార్థినికి కంటి పరీక్ష చేస్తున్న ఆప్తాల్మిక్ అధికారి

తల్లిదండ్రులూ వీటిపై 'దృష్టి'సారించండి..

- చదివేటప్పుడు పుస్తకాలు మరీ దగ్గరగా పెట్టుకుంటారు. అలా కాకుండా కంటికి.. పుస్తకానికి మధ్య 30 సెం.మీ. దూరం ఉండటంతో పాటు కూర్చుని చదివించండి.
- విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉండే ఆహారం అందిస్తే కంటి చూపు మెరుగుపడుతుంది. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా అందించండి.
- ఖాళీ సమయాల్లో చరవాణులతో కాలక్షేపం చేయకుండా ఆరుబయట ఆడుకునేలా చేయండి. సహజవెలుతురులో ఉంటే హ్రస్వదృష్టి (మయోపియా) వచ్చే ప్రమాదాన్ని అరికట్టవచ్చు.
- ఎక్కువ సేపు టీవీలు, స్మార్ట్ ఫోన్లు వంటివి చూస్తే కళ్లు పొడిబారి సమస్యలు తలెత్తుతాయి. అలా జరగకుండా ఉండేందుకు ఎలక్ట్రానిక్స్ స్క్రీన్ టైం తగ్గించాలి.

ఇదే ప్రధాన కారణం..

చిన్నారులు ఖాళీ సమయం దొరికితే స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. వీడియో గేమ్స్ ఆడుతూ గంటలకొద్దీ గడిపేస్తున్నారు. ఇదే కంటి సమస్యలకు ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. పోషకాహారం, జన్యులోపాల వల్ల కూడా కొందరిలో దృష్టి లోపాలు తలెత్తుతున్నప్పటికీ అది స్వల్పమే అని అంటున్నారు.

సిబ్బంది కొరతతో ఆలస్యం..

జిల్లావ్యాప్తంగా మండలానికి ఒకరు చొప్పున 30 మంది ఆప్తాల్మిక్ అధికారులు ఉండాలి. ప్రస్తుతం 18 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పాఠశాలల్లో పరీక్షలు చేయడం కొంత ఆలస్యమవుతోంది. సిబ్బంది కొరతను అధిగమిస్తే ప్రక్రియ మరింత వేగవంతమయ్యే అవకాశముంది.

ఇదీ పరిస్థితి

- విద్యార్థులు: 61,494
- దృష్టి పరీక్షలు జరిగిన పాఠశాలలు: 411
- కళ్లద్దాలు అవసరమైనవారు: 4,014
- బాలురు: 1,344
- బాలికలు: 2,680

అక్టోబరు నాటికి పూర్తి చేస్తాం..

జిల్లాలో ఇప్పటి వరకు 411 బడుల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశాం. ఆయా చోట్ల కళ్లద్దాలు అవసరమైనవారిని గుర్తించాం. ఇంకా 261 పాఠశాలల్లో చేయాల్సి ఉంది. అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం. – డాక్టర్ త్రినాథరావు, మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ

ఇక్కడ 3 అక్కడ 3

- టెట్ నిర్వహణకు కేంద్రాలు ఖరారు
- ఒడిశాలో 1,874 మందికి కేటాయింపు

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహణకు రెండు నెలల కిందట దరఖాస్తులు ఆహ్వానించింది. వచ్చే నెల 3 నుంచి 21 వరకు పరీక్ష నిర్వహణ విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్నవారికి వివిధ తేదీల్లో జిల్లాలో 3, ఒడిశాలో 3 కేంద్రాలు కేటాయించారు.

జిల్లా నుంచి మొత్తం 16,185 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే చాలా మంది హాల్ టిక్కెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో అత్యధికంగా 10,091 మంది పరీక్ష రాయనున్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 3,200 మందికి, శ్రీశివానిలో 1,020 మందికి కేటాయించారు. ఒడిశాలోని గంజాం జిల్లాలోనూ 1,874 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. బరంపురం ఎస్ఎంఐటీ కేంద్రంలో 353 మంది, కళ్లికోట అయాన్ డిజిటల్ జోన్‌లో 734 మంది, ఎస్ఎంఐటీ డిగ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో 787 మంది పరీక్ష రాయాల్సి ఉంది. సుదూర ప్రాంతాలు, పొరుగు రాష్ట్రంలో కేంద్రాలను కేటాయించడంతో పలువురు అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే దూర ప్రాంతాల్లో కేంద్రాలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

ఉద్యోగమిచ్చారు.. చెప్పకుండా తీసేశారు..!

ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎంఎన్‌వోలు

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని మేల్ నర్సింగ్ ఆర్డర్లీ(ఎంఎన్‌వో)లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో కొవిడ్ సమయంలో పొరుగు సేవల విధానంలో 71 మంది ఎంఎన్‌వోలను నియమించారు. పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను వారికి కేటాయించారు. వివిధ కారణాలతో వారిలో పలువురు ఉద్యోగం మానేసి వెళ్లిపోయారు. మిగిలిన 13 మందిని 2021 నవంబరు ఒకటి నుంచి అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ విషయాన్ని బాధితులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపించలేదు. కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అయిదుగురు హైకోర్టు నుంచి ఆశ్రయించగా.. విధుల్లోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తొలగించి, ఆ పోస్టులను వేరే జీవో ద్వారా అక్రమంగా భర్తీ చేశారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ సంబంధిత దస్త్రం కలెక్టర్ పరిశీలనలో ఉందని పేర్కొన్నారు.


న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

ఆ సూట్‌కేస్‌లో ఏముంది..?




గుణుపురం-విశాఖ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం ఓ సూట్‌కేస్ కలకలం సృష్టించింది. ఒడిశా రాష్ట్రం పర్లాఖెముండిలో 45 ఏళ్ల వయసున్న వ్యక్తి సూట్‌కేస్‌తో సహా ఎక్కి ఓ సీటు కింద దాన్ని ఉంచి వేరే చోట కూర్చున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. అనుమానం వచ్చి గట్టిగా ప్రశ్నించడంతో ఆ సూట్‌కేస్ తనది కాదని, తాను మటన్ దుకాణంలో పనిచేస్తున్నట్లు చెప్పాడు. తాను విశాఖపట్నంలోని గాజువాకకు వెళ్తున్నట్లు చెప్పి పాతపట్నంలోనే దిగిపోయాడు. ప్రయాణికులు ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఆర్పీఎఫ్ ఎస్సై నిఖిల్‌కుమార్ నౌపడ రైల్వే స్టేషన్ వద్ద సూట్‌కేసును స్వాధీనం చేసుకొని శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌కు తరలించారు. సూట్‌కేస్ ఇంకా తెరవలేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాక పూర్తిస్థాయి విచారణ జరుపుతామని జీఆర్పీ ఎస్సై మధుసూదనరావు తెలిపారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం, ఆమదాలవలస పట్టణం

దారి కష్టాలు ఇన్నిన్ని కాదయా..



అలికాం-బత్తిలి రహదారిలో సరుబుజ్జిలి పోలీసుస్టేషన్ నుంచి గోనెపాడు కూడలి వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర భారీ గుంతలు పడిన రోడ్లపై ప్రయాణికులు బిక్కు బిక్కు మంటూ ప్రయాణం చేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి పాతపట్నం, బత్తిలి వెళ్లేవారు ఈ మార్గంలోనే ప్రయాణించాలి. గురువారం సరుబుజ్జిలి పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆర్టీసీ బురదలో కూరుకుపోయింది. రోజూ ఈ మార్గంలో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులకు పట్టించుకోవట్లేదని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే సరుబుజ్జిలి

తెదేపా శాశ్వత సభ్యత్వానికి ఎంపీ కలిశెట్టి రూ.లక్ష అందజేత



తెదేపాలో శాశ్వత సభ్యత్వానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రూ.లక్ష చెక్కును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో మంత్రి నారా లోకేశ్‌కు గురువారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. వచ్చే నెలలో తెదేపా సభ్యత్వ నమోదు ప్రారంభం కానున్న నేపథ్యంలో తొలి సభ్యత్వం ఇదేనని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తనైన తనను ఎంపీగా అవకాశం కల్పించి పార్లమెంటుకు తెదేపా పంపిందని.. సభ్యత్వ నమోదుకు రూ.లక్ష అందజేయడం ఆనందంగా ఉందన్నారు.
- న్యూస్‌టుడే, విశాఖపట్నం



పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా పాఠశాల క్రీడా పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు అథ్లెటిక్స్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి 1,300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వర్షం కారణంగా క్రికెట్ పోటీలు, అథ్లెటిక్స్‌లో పోల్ వాల్ట్, హైజంప్ పోటీలు వాయిదా పడ్డాయి. పరుగు, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు పూర్తయ్యాయి. వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ప్రతినిధులు కె.రాజారావు, ఎస్.శ్రీనివాసరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ఆర్డీవోగా సాయిప్రత్యూష

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)గా కె.సాయిప్రత్యూష, టెక్కలి ఆర్డీవోగా ఎం.కృష్ణమూర్తిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీకాకుళం ఆర్డీవోగా పని చేస్తున్న సీహెచ్ రంగయ్యను బదిలీ చేసినప్పటికీ ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వంశధార ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్మోహనరావును బొబ్బిలి ఆర్డీవోగా బదిలీ చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

చరవాణిలో ఉపాధి సమాచారం..!

అక్రమాలు అరికట్టడానికి జన్‌మన్ నరేగా యాప్

కవిటి గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాయి. ఇందులో భాగంగా వేతనదారులకు అందజేసే సొమ్ము దుర్వినియోగం కాకుండా బ్యాంకు, తపాలా కార్యాలయాల్లో ఖాతాలు తెరిచి వాటి ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. కొందరికి ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు ఉండటం, ఆధార్ అనుసంధానం ద్వారా డబ్బులు ఏ ఖాతాలో జమ చేశారో తెలుసుకునేందుకు వారు ఇబ్బంది పడేవారు. ఈ బాధలు తప్పేలా కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ నరేగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలోని 30 మండలాల్లో 3.84 లక్షల జాబ్ కార్డులు క్రియాశీలకంగా ఉన్నాయి. అందులో 6.18 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వేసవిలో 2.54 లక్షల మంది, ప్రస్తుతం 1.25 లక్షల మంది పనులకు వస్తున్నారు.



కవిటి రాజపురం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

వినియోగం ఇలా..

ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోరు నుంచి జన్‌మన్ నరేగా యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలి. అందులో పనికి వచ్చే వారి వేతనాలు, పని దినాలకు సంబంధించిన ఐచ్ఛికాన్ని ఎంపిక చేయాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబం ఐడీ వివరాలు నమోదు చేయాలి. చెల్లింపు ఐచ్ఛికానికి వెళ్లి వ్యక్తి పేరు ఎంపిక చేస్తే ఎక్కడ పని చేశారు? పని సంఖ్య తదితర వివరాలతో పాటు వేతనాలు, ఎప్పుడు జమ చేశారు. ఏ బ్యాంకులో జమ చేశారో తెలుస్తుంది.

❖ ఉపాధి వేతనాలు జమ కాకపోతే లబ్ధిదారు ఖాతాకు ఆధార్ అనుసంధానం అయిందా? ఆధార్ ప్రకారం బ్యాంకు వివరాలు ఉన్నాయా? అనే వివరాలుంటాయి. అన్నింటికీ అనుసంధానమైతే పచ్చ రంగులో రైట్ గుర్తు.. లేకుంటే దేనికి కాలేదో అక్కడ ఎర్ర రంగులో తప్పు గుర్తు కనిపిస్తుంది. జాబ్ కార్డులోని కుటుంబ సభ్యులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పని చేశారనే వివరాలూ కనిపిస్తాయి.

ఫిర్యాదులకూ అవకాశం..

ఉపాధి పనుల కింద తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఏడు రిజిస్టర్లు, వేతనదారుల పని హక్కులు అందుబాటులో ఉన్నాయి. యాప్ 11 ప్రాంతీయ బాషల్లో అందుబాటులో ఉంది. పనులు తెలుసుకోవడంతో పాటు అక్రమాలపై సైతం యాప్‌లో ఫిర్యాదు చేయడానికి అవకాశం కల్పించారు.

పనుల్లో పారదర్శకత కోసమే..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కోసం యాప్ ద్వారా సమాచారమంతా అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్ ద్వారా వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. పనులు ఎన్ని రోజులు చేశారు? ఎంత సొమ్ము వచ్చింది? ఏ బ్యాంకులో జమ అయిందనే సమాచారం నేరుగా తెలుసుకోవచ్చు.
- సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఏపీడీ, పలాస క్లస్టర్

ఒరిగిన గ్రానైట్ లారీ.. జారిపడ్డ బ్లాక్‌లు



టెక్కలి-మెళియాపుట్టి రహదారిలో గురువారం వేకువజామున గ్రానైట్ బ్లాక్‌లతో వెళ్తున్న లారీ నర్సింగపల్లి సమీపంలో పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో లారీపై ఉన్న రెండు భారీ బ్లాక్‌లు ఒరిగి పొలం గట్టుపై పడ్డాయి. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం ముచ్చర్లలోని ఎ.సూర్యనారాయణ (గ్రానైట్స్) నుంచి మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపంలోని ఆర్ఎం ఎక్స్‌పోర్ట్స్ గ్రానైట్ పరిశ్రమకు రెండు గ్రానైట్ బ్లాక్‌లు తరలించారు. లారీలో తరలించడానికి అనుమతులు పొందారు. ప్రమాదం అనంతరం వైకాపా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పత్రాలను పొందుపరిచి తెదేపా నేతలు అక్రమ రవాణా చేస్తున్నారంటూ విస్తృతంగా ప్రచారం చేశారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి కుటుంబంపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని తెదేపా శ్రేణులు డిమాండు చేస్తున్నాయి. - న్యూస్‌టుడే, టెక్కలి

గేటు వద్ద నిలిచిన గూడ్స్ రైలు



కళింగపట్నం-పాతపట్నం 326ఎ జాతీయ రహదారిలో తిలారు రైల్వే గేటు వద్ద గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి పలాస వైపు వెళ్తున్న గూడ్స్ రైలు సుమారు 15 నిమిషాల పాటు గేటు మధ్యలో నిలిచిపోవడంతో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. అండర్ పాస్ వంతెనలో వర్షం నీరు చేరడంతో దాని నుంచి రాకపోకలు నిలిపివేశారు. దీనికి తోడు నారాయణవలస సంత కావడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గూడ్స్ రైలు డ్రైవరు చాకచక్యంగా నెమ్మదిగా ముందుకు కదిలించడంతో సమస్య తీరింది. ఈ విషయమై తిలారు రైల్వే నిలయం అధికారి వద్ద ప్రస్తావించగా వర్షం కారణంగా ఇంజిన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడిందని, వెంటనే పరిష్కరించి బండిని ముందుకు నడిపించినట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, జలుమూరు

సమగ్ర శిక్షా నియామకాల ప్రకటనపై ఫిర్యాదు

సారవకోట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు సంబంధించి రాష్ట్ర సమగ్ర శిక్షా ఈ నెల 23న విడుదల చేసిన నోటిఫికేషన్‌పై ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి గురువారం దిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివాసీలకు 6 శాతం రిజర్వేషన్ ప్రకారం టీచింగ్ పోస్టులు 507 భర్తీకి గాను 30 పోస్టులు కేటాయించవలసి ఉండగా కేవలం 10 మాత్రమే కేటాయించారని, నాన్ టీచింగ్ పోస్టులకు సంబంధించి 97కు గాను ఒక్క పోస్టు కూడా కేటాయించలేదని తెలిపారు. పోస్టుల భర్తీలో రిజర్వేషన్ పాటించకపోవడంతో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ నోటిఫికేషన్ రద్దు చేసి, ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా రావలసిన పోస్టులు కేటాయించే విధంగా తిరిగి నోటిఫికేషన్ ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. కమిషన్ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో ఫిర్యాదును అందజేసినట్లు పేర్కొన్నారు.

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సమాఖ్య (ఏపీటీఎఫ్) ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో నిర్వహించనున్న వేడుకలను విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోంలో గురువారం మహాసభల గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయనగరం ఫూల్‌బాగ్ రోడ్డులోని జే కన్వెన్షన్ మార్పు బాలకృష్ణమ్మ ప్రాంగణంలో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు, విద్యావేత్తలు, మేధావులు పాల్గొంటారన్నారు. విద్యా ప్రగతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై తీర్మానాలు చేస్తామని చెప్పారు. సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సదాశివరావు, సహాధ్యక్షుడు సీహెచ్ దిలీప్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రవి, బుక్కూరు వెంకటేశ్వర్లు వి.కామేశ్వరరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇప్పిలి, ఒప్పంగి, ఎన్టీఆర్ ఎంహెచ్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను మహాసభలకు ఆహ్వానించారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక




దున్న రవి ఎర్ర భవాని

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ పొన్నాడ రవికుమార్, అధ్యక్షుడు చిట్టి నాగభూషణం తెలిపారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దున్న రవి, ఎర్ర భవాని జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. రాంచీలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు పోటీలు జరుగుతాయని కార్యనిర్వాహక అధ్యక్షుడు సాధు శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో చోదకుడి మృతి



వంద్రాడ రాజు (పాత చిత్రం)

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం రంకిణి పంచాయతీ భగంతర గ్రామానికి చెందిన ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పాతపట్నం ఏఎస్సై టి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. భగంతరలోని తన ఇంట్లో ఉన్న వంద్రాడ రాజు(32) రాత్రి సమయంలో ఇంటికి ఆనుకొని ఉన్న పెరడు ఇంటికి వెళ్తుండగా రెండింటి మధ్యలో ఉన్న విద్యుత్తు తీగను అనుకోకుండా తాకడంతో ప్రమాదానికి గురయ్యాడు. అక్కడే ఉన్న భార్య రజిని వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేసింది. స్థానికుల సహకారంతో పాతపట్నం సామాజిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృత్యువాత పడినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజుకు పిల్లలు లేరు. ఇతడు ట్రాక్టరు డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడి మృతితో తండ్రి పోలయ్యతో పాటు భార్య, ఇతర కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విచారంలో మునిగిపోయారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పెద్దలంబ వాసిపై పోక్సో కేసు నమోదు

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దలంబ పంచాయతీకి చెందిన బుద్దల హేమసుందరరావుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.అనిల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన బాలిక సమీపంలోని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. బాలికతో ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న హేమసుందరరావు ఈ నెల 16న మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంపై భావనపాడు బీచ్‌కు తీసుకువెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చిన బాలిక ముభావంగా ఉండటంతో పాటు కడుపులో నొప్పిగా ఉందని తల్లికి చెప్పింది. ఆమె ప్రశ్నించడంతో ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. బాలిక తల్లి గ్రామ పెద్దలకు విషయాన్ని తెలియజేయడంతో పాటు సారవకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటన నౌపడ పోలీస్టేషన్ పరిధిలో జరిగిందని, అక్కడే ఫిర్యాదు చేయాలని ఇక్కడి పోలీసులు సూచించారు. దీంతో నౌపడ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించగా సారవకోట పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అక్కడి పోలీసులు సూచించారు. చేసేది లేక ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించి జరిగిన విషయం తెలియజేశారు. స్పందించిన ఎస్పీ కేసు నమోదు చేయాలని సారవకోట ఎస్సైకు సూచించారు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద సారవకోట ఎస్సై కేసు నమోదు చేశారు.

బాధ్యతల స్వీకరణ

డీఎంజీవోగా మోహనరావు



శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారిగా (డీఎంజీవో) సి.మోహనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

డీఎఫ్‌వోగా సంజయ్



బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా అటవీ శాఖ అధికారిగా ఎల్.సంజయ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలో ఆయనను రేంజ్ అధికారులు కలిసి అభినందించారు.

జలవనరుల శాఖ ఈఈగా అప్పలనాయుడు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా జలవనరుల శాఖ ఈఈగా రాజాన అప్పలనాయుడును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన పార్వతీపురం మన్యం జిల్లాలో ఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఈఈగా పని చేస్తున్న పొన్నాడ సుధాకర్‌ను ప్రభుత్వం బదిలీ చేసినా పోస్టింగ్ ఇవ్వలేదు. వంశధార సర్కిల్ పరిధిలో హిరమండలం ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎంవీ రమణను విజయనగరం ఈఈగా బదిలీ చేశారు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

ఆరోగ్యం కాపాడుకోవాలి

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం బ్రాహ్మణతర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గౌతు లచ్చన్న బలిజన వర్గాల సంస్థ, ఉత్తర అమెరికా తెలుగు సంఘం, హోప్ ఫర్ లైఫ్ సంస్థల ఆధ్వర్యంలో రుతుచక్రంపై అవగాహన కల్పించారు. కౌమార దశలో ఆరోగ్యం కాపాడుకోవాలని ఆ సంస్థల ప్రతినిధులు విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణారావు, హోప్ ఫర్ లైఫ్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ హిమజ, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు


అవగాహన కల్పిస్తున్న సోంపేట సీఐ మంగరాజు

కంచిలి, న్యూస్‌టుడే: గంజాయి, నాటుసారా, గుట్కా, మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని సోంపేట సీఐ మంగరాజు తెలిపారు. గురువారం కంచిలి పరిధి సోంపేట రైలు నిలయం ఆవరణలో ప్రయాణికులు, స్థానికులు, ఆటో డ్రైవర్లకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల రవాణాకు సహకరించి, సమస్యల్లో చిక్కుకోవద్దని హెచ్చరించారు.

వాన తెచ్చిన కష్టం


మందస: చీపి గెడ్డలో కలుస్తున్న వరద నీరు



వజ్రపుకొత్తూరు: అధ్వానంగా ఉన్న పాఠశాల ప్రధాన రహదారి

పలాస నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. దీంతో రోడ్లపైకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వజ్రపుకొత్తూరు మండలంలోని పెద్దబడం-అంతర్వేదం రహదారిపై వరద నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హుకుంపేట ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి ఉన్నత పాఠశాల మార్గంలో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బురద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. నువ్వలరేవులో పలు చోట్ల రహదారిపై నీరు నిలిచిపోయింది. పీజేపురం వద్ద రహదారి అధ్వానంగా తయారైంది. ● మందస మండలంలోని చీపి గెడ్డకు వరద తాకిడి పెరిగింది.

– వజ్రపుకొత్తూరు, వజ్రపుకొత్తూరు గ్రామీణం, మందస, న్యూస్‌టుడే

జంతిబందకు.. మోక్షం కలుగుతుందా..!

న్యూస్‌టుడే, హరిపురం (మందస)


జలాశయంగా అభివృద్ధి చెందాల్సిన జంతిబంద

జంతిబందను జలాశయంగా అభివృద్ధి చేయాలన్నది దశాబ్దాలుగా మందస, వజ్రపుకొత్తూరు మండలాల ఉద్దానం ప్రజల ఆకాంక్ష. మందస మండలం బహాడపల్లి పరిధిలో ఉన్న దీన్ని ప్రజల అభ్యర్థన మేరకు తెదేపా జలాశయంగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా రూ. 1.60 కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో రెండు మండలాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తాగు, సాగునీటి కష్టాలు ఇన్నాళ్లకు తీరుతున్నాయని అనుకున్నారు. తరువాత వచ్చిన వైకాపా పనులు నిలిపివేసింది. నిధులు సైతం వెనక్కి మళ్లించడంపై ఆయా మండలాల ప్రజలు ఆవేదన చెందారు. రైతు ప్రభుత్వం అని చెప్పి వైకాపా నాయకులు ఉద్దానం ప్రజలకు అన్యాయం చేశారని వాపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ప్రజలు మళ్లీ ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గానికి వంశధార నీరు వచ్చినట్లే ఈసారి జంతిబంద జలాశయంగా మారుతుందన్న ఆశాభావంతో ఉన్నారు.

వేసవిలోనూ నీరు

జంతిబందలో వేసవిలోనూ నీరు ఉంటుంది. ఆ నీటితో దిగువ ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ పంటలు సాగువుతున్నాయి. జలాశయంగా అభివృద్ధి చెందితే సాగు విస్తీర్ణం నాలుగింతలు పెరుగుతుంది. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమవుతుంది. మెట్ట భూములు సైతం పంటలతో సస్యశ్యామలంగా మారుతాయి.

జలాశయంగా అభివృద్ధికి విజ్ఞప్తి

ఆటంకాలతో ముందుకు కదలని పనులు

అభివృద్ధి చేస్తాం

జంతిబందను జలాశయంగా అభివృద్ధి చేస్తాం. పలాస నియోజకవర్గం పరిధిలోని పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరు తెప్పించాం. మైనర్ ఇరిగేషన్‌లో భాగంగా మందస మండలంలోని కళింగదళ్, డబార్సింగి, దామోదర్‌సాగర్ జలాశయాల మరమ్మతులు, జంతిబంద జలాశయం అభివృద్ధి కోసం ప్రతిపాదించాం. నిధులు రప్పించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం. – గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస.

వెనుకబాటుకు పాలకులే కారణం


మాట్లాడుతున్న మాధవరావు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర అంటే వలసలకు నిలయమని, ఈ ప్రాంతం వెనకబాటుకు పాలకులే కారణమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి. మాధవరావు పేర్కొన్నారు. కాశీబుగ్గలోని పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలు అమలు చేస్తామని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని మాయ మాటలు చెప్పి నాయకులు గడపుతున్నారన్నారు. నదులు అనుసంధానం చేయడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. వీరస్వామి, వినోద్, భీమారావు, తాతారావు, రామారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

సమస్య : పట్టణం చిదంబరేశ్వరపేట వద్ద రహదారి మలుపుల్లో ముళ్లపొదలు పెరిగిపోయాయి.

– పి.హర్షిత, ఇచ్ఛాపురం

సమాధానం : తొలగిస్తాం.

– పి.మోహనరావు, ఏఈ, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	8309638875
పలాస గ్రామీణం	7386408926
కంచిలి గ్రామీణం	9704568738

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం


ఎన్నికైన కమిటీ సభ్యులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను సంఘటితంగా అడ్డుకునేందుకు కవిటి మండలంలో కమిటీని ఏర్పాటు చేశారు. గురువారం కవిటి చింతామణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించి సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎస్సీ వర్గీకరణ పోరాట సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీకి అధ్యక్షులుగా బాగ.వేణు, ప్రధాన కార్యదర్శిగా కేశవరావు, ఉపాధ్యక్షులుగా లింగరాజు, ధర్మారావు, కేశవరావు, కుమార్, సహాయ కార్యదర్శులుగా ధర్మారావు, సుధాకర్, జీవన్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

జలాశయాల్లో భద్రతపై శిక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులతో ఎంపీఈడీఏ అధికారులు

మందస, న్యూస్‌టుడే : జలాశయాల్లో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్న ఎస్సీ సామాజిక వర్గ కార్మికులకు మందస మండలం బుడార్సింగి పంచాయతీ చొంపాపురంలో గురువారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. చేపల వేటలో అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రత గురించి చెప్పారు. ఈ సందర్భంగా కార్మికులకు వానకోటు, లైఫ్ జాకెట్లు, టోపీలు, బ్యాక్‌ప్యాక్‌లతో పాటు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీఈడీఏ సహాయ సంచాలకులు ఆర్.ప్రసాద్ నాయక్, బాలాజీ, సునీల్‌కుమార్, సాయికిషోర్ సర్పంచి సురేష్ పాణిగ్రహి, ఎంపీటీసీ సభ్యులు లోకనాథం పాల్గొన్నారు.

పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పరిధిలో స్వచ్ఛందంగా సేవలందించేందుకు యువతీయువకులను ఆహ్వానిస్తున్నట్లు ఇచ్ఛాపురం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు, న్యాయమూర్తి పరేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వాలంటీరుగా సేవలందించాల్సి ఉంటుందని, పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. న్యాయస్థానం నుంచి ఎలాంటి జీతభత్యాలు రావని, స్వచ్ఛందంగా సేవలందించాల్సి ఉంటుందన్నారు. వచ్చేనెల 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. న్యాయస్థానం ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 78930 02368ను సంప్రదించాలని న్యాయమూర్తి తెలిపారు.

దారి కనిపిస్తోంది

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని పలు ఉద్దానం ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులపైకి చెట్ల కొమ్మలు, పొదలు పెరిగి రహదారులు కనిపించడం లేదు. ఈ విషయమై ఈనాడులో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పూండి నుంచి రెయ్యిపాడు మీదుగా పల్లివూరు, పూండి నుంచి కేఆర్‌పేట, అమలపాడు ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించినట్లు విద్యుత్తు శాఖ ఏఈ జీవీ రమణ తెలిపారు.

కిష్టుపురంలో పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న డీఎల్‌పీవో రమణ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం కిష్టుపురంలో విషజ్వరాలు పెరుగుతుండడంపై 'కిష్టుపురంలో విష జ్వరాలు' శీర్షికతో గురువారం ఈనాడులో ప్రచురితమైన వార్తకు డీఎల్‌పీవో ఐవీ రమణ, వైద్యశాఖ అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేయించారు. వైద్యశాఖ అధికారులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యురాలు దేవి, ఎంఎల్‌హెచ్‌పీ ఇందుమతి, మండల విస్తరణాధికారి వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శులు ధర్మసాయి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

తొలగించి.. సమస్య పరిష్కరించి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని కాశీనగర్ నుంచి రాజపేట వైపు వెళ్లే విద్యుత్తు తీగలపై గడ్డి మొక్కలు అల్లుకున్న విషయం తెలిసిందే. ఈ సమస్య పై 'ఈనాడు'లో ఈ నెల 6న 'గడ్డి మొక్కలు తొలగించండి' శీర్షికతో వార్త ప్రచురించడంతో అధికారులు స్పందించారు. విద్యుత్తు శాఖాధికారుల పర్యవేక్షణలో తీగలు తొలగించారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా!


వజ్రపుకొత్తూరు సమీపంలోని అక్రమంగా నిల్వ చేసిన సరుగుడు కలప

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరు, చినకొత్తూరు, కిడిసింగి, హుకుంపేట, మంచినీళ్లపేట, కొత్తపేట, చినవంక, మెట్టూరు, గుణుపల్లి తదితర సముద్ర తీర భూముల నుంచి పచ్చని చెట్లు అక్రమార్కుల గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. పచ్చదనం హరించి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ఆయా తీరాల్లో అత్యధికంగా సాగువుతున్న సరుగుడు, నీలగిరి, టేకు, కాము, మద్ది వంటి విలువైన చెట్లను నరికేస్తున్నారు. ఇతర జిల్లాలకు యథేచ్ఛగా లారీల ద్వారా అక్రమ రవాణా సాగిస్తున్నారు. అటవీ శాఖ, రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా సంబంధితాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటేలా చిన్నారులను ప్రోత్సహించాలి



పలాస, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచే చిన్నారులకు మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. చిన్నబడాం చెరువు గట్టుపై మిల్లు యజమాని నర్తురామారావు కుమార్తె నర్తు దేవి జన్మదినం సందర్భంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పెళ్లిళ్లు, జన్మదిన రోజుల్లో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో భాజపా ఇన్‌ఛార్జి రామానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కలెక్టర్ సందర్శన

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని మెట్టూరులో ప్రభుత్వ భూములను గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. కొబ్బరి బోర్డు ఏర్పాటులో భాగం ఆర్డీవో భరత్ నాయక్‌తో కలిసి పలు చోట్ల అనుకూల ప్రాంతాలను పరిశీలించి వివరాలు సేకరించినట్లు తహసీల్దారు పి.బాల తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు నివేదికలు పంపనున్నట్లు చెప్పారు.

ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే.. తక్షణమే బిల్లు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేసి, సంబంధిత బిల్లులు పొందాలని గృహనిర్మాణ సామాజికాభివృద్ధి నిపుణులు చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. ఇచ్ఛాపురం పరిధిలో ఉన్న గృహనిర్మాణ ప్రాంతాల్లో శనివారం ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహించి, లబ్ధిదారుల సందేహాలు నివృత్తి చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలు మార్చి 2025 లోగా పూర్తి కావాలన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం



ఇచ్ఛాపురం, పలాస నియోజవర్గాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గురువారం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ తిరిగి కూటమి హయాంలో 100 రోజుల్లో జరిగిన సంక్షేమన్ని వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి, స్టిక్కర్లు ఇళ్లకు అంటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా సాగిస్తున్న పాలనపై అవగాహన కలిగించారు. ఇది ప్రజలు ప్రభుత్వమని, అందరికి మంచి జరుగుతుందని తెలిపారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం, కవిటి గ్రామీణం, కంచిలి గ్రామీణం

శరన్నవరాత్రి ఉత్సవాలకు శుభరాట


శుభరాట వేస్తున్న పూజా కమిటీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఇచ్ఛాపురం మండల పరిధి ఈదుపురం గ్రామంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు పూజా కమిటీ ఆధ్వర్యంలో గురువారం శుభరాట వేశారు. వేదపండితులు నీలగిరి రామకృష్ణ సిద్ధాంతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు నర్తు ప్రేమ్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఈశ్వరరావు ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి

సోంపేట, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ 2024 పంటల నమోదు చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో బి.నరసింహమూర్తి అన్నారు. గురువారం ఆయన శిరిమామిడి, శాసనం గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. పంటల నమోదు అతి త్వరలోనే ముగియనున్నందున ప్రతి రైతు వ్యవసాయసహాయకుల వద్ద వేలిముద్రలు వేయించుకోవాలని సూచించారు. మండలంలో ఇంతవరకు 85 శాతం రైతుల ఈకేవైసీ పూర్తయిందని, మిగిలినవారు కూడా శనివారంలోగా చేసుకోవాలని సూచించారు.

పరిశుభ్రతతోనే అందరికీ ఆరోగ్యం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: వ్యక్తిగతంగా పరిశుభ్రతను పాటిస్తున్నట్లే, పరిసరాల విషయంలోనూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా అందరికీ ఆరోగ్యం లభిస్తుందని పురపాలకసంఘ పారిశుద్ధ్య విభాగ అధికారి పి.ఉపేంద్రకుమార్ అన్నారు. కమిషనర్ నల్లి రమేష్ ఆదేశాల మేరకు పట్టణ ప్రధాన రహదారి, బంగ్లారోడ్‌తో పాటు పురపాలకసంఘ కార్యాలయాన్ని గురువారం శుభ్రపరిచారు. అలానే ఉప్పాడవీధిలో మహిళలకు ప్రత్యేకంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించారు.

విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాలలో కొర్ల టంకోదర బయోజికల్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవల ఆకాల మరణం చెందారు. గురువారం ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వర పండా ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

వ్యర్థాలకు కొత్త అర్థం చెబుదాం


వ్యర్థాలతో తయారుచేసిన వస్తువులతో ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు

పలాస, న్యూస్‌టుడే: పనికిరాని వస్తువులు, వ్యర్థాలకు కళాత్మకమైన రూపాన్ని ఇచ్చే విధంగా ఆసక్తి పెంచుకోవాలని పలాస ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి తెలిపారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా 'వేస్ట్ టూ వెల్త్' పోటీలు గురువారం నిర్వహించారు. విద్యార్థులు వ్యర్థాలతో ఉపయోగకరమైన వస్తువులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతిరావు, సమన్వయకర్త వెంకటరమణ, గ్రంథాలయాధికారి నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పురపాలక సమావేశ మందిరంలో 'మన ఇళ్లు మన గౌరవం' కార్యక్రమంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. అర్హులైన అందరికి ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే స్థలం పొంది ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయని వారికి అవగాహన పెంచి శతశాతం పూర్తిచేసేలా చూడాలన్నారు.

నాటు సారా పట్టివేత

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి మండలం పరిధి జక్కర సమీపంలో అక్రమంగా నాటు సారా తరలిస్తున్న అనిల్ అనే వ్యక్తిని కంచిలి పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. రూ.12వేలు విలువైన సరకు పట్టుకుని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేష్ తెలిపారు.

పోలింగ్ కేంద్రం మార్పు


సవరణ వివరాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కవిటిమండలం దూగానపుట్టుగ గ్రామానికి చెందిన పోలింగ్ కేంద్రం బెజ్జిపుట్టుగలో ఉంది. 131వ కేంద్రంగా బెజ్జిపుట్టుగ ఎంపీయూపీలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దానిని తమ గ్రామానికి మార్చాలని దూగానపుట్టుగ ప్రజలు గతంలో విజ్ఞప్తి చేశారు. దీంతో కవిటి మండల తహసీల్దార్ మురళీమోహనరావు, ఇచ్ఛాపురం ఎన్నికల ఉపతహసీల్దారు బి.శ్రీహరిబాబు 'స్పెషల్ సమ్మరీ రివిజన్-2025' మేరకు గ్రామసభ నిర్వహించారు. ఏకగ్రీవ తీర్మానం మేరకు దూగానపుట్టుగకు మార్చారు. ఈ సవరణను శాసనసభ్యులు అశోక్‌కు నివేదించగా, ఆయన కూడా ఆమోదించారని శ్రీహరిబాబు వెల్లడించారు. మృతులు, ఇతర ప్రాంతాలకు పూర్తిగా వలస వెళ్లిన ఓటర్లు తదితర అంశాలను పరిశీలించారని తెలిపారు.

లభించని అప్పన్న ఆచూకీ


కొత్తూరు తీరంలో అప్పన్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

సోంపేట, న్యూస్‌టుడే: పడవబోల్తా పడిన ఘటనలో బుధవారం గల్లంతైన మత్స్యకారుడు రట్టి అప్పన్న ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు తీరంలోనే రోదిస్తూ గడిపారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడూళ్లపాలెం నుంచి ఇద్దివానిపాలెం వరకు మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. అప్పన్న భార్య, కుమారుడితోపాటు బంధువులు, గ్రామస్థులు రోజంతా కొత్తూరు తీరంలోనే ఉన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో నిరాశ చెందారు. మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు తీరప్రాంత గ్రామాలకు సమాచారమిచ్చి వాకబు చేస్తున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సోంపేట, కవిటి, న్యూస్‌టుడే : మామిడిపల్లి పరిధిలో 11కేవీ మరమ్మతులు, చెట్లు తొలగించేందుకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్తుశాఖ ఈఈ యోగేశ్వరరావు తెలిపారు. ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి, టి.శాసనం, గొల్లూరు, ఉప్పలాం, సిరిమామిడి, యర్రముక్కం, రాణిగాం, బట్టిగొల్లూరు, కొత్తరాజం, అనంతపురం గ్రామాలకు గృహ, వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు. ● భైరిపురం, డి.జి.పుట్టుగ, నెలవంక, కపాసుకుద్ది పంచాయతీ గ్రామాలకు సైతం ఇదే సమయంలో అంతరాయం కలుగుతుందన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 152 మంది ఎంపిక


ఖోఖో ఆడుతున్న బాలురు

కవిటి గ్రామీణం, కంచిలి, న్యూస్‌టుడే: రాజపురం ఆదర్శ పాఠశాల ఆవరణంలో గురువారం నిర్వహించిన క్రీడా పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో 152 మంది బాలికలు, బాలుర క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ సమన్వయకర్త కె.పద్మనాభం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగాలో ఎంపికైనట్లు వెల్లడించారు. ● కవిటి మండలం రాజపురంలో జరుగుతున్న స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో భాగంగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో కంచిలి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు అఖిల్, సాయి దివాకర్, 9వ తరగతి విద్యార్థులు గురునాథం, భగవాన్‌లు కబడ్డీ, ఖోఖో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు సీతారామనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

మరమ్మతులు చేపట్టారు

స్థానిక వెంకటేశ్వర కాలనీలో వీధి దీపాలకు పంచాయతీ యంత్రాంగం గురువారం మరమ్మతులు నిర్వహించింది. ఆ ప్రాంతంలో రెండు వారాలుగా వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'ఈనాడు-మీ తోడు' దృష్టికి సమస్యను తీసుకురావడంతో పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు జరిపించారు.

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

హమాలీల నిరసన



కోటబొమ్మాళి, సంతబొమ్మాళి గిడ్డంగుల వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తపేటలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి గిడ్డంగుల వద్ద గురువారం హమాలీలు (కూలీలు) నిరసన కార్యక్రమం చేపట్టారు. తక్షణమే కూలీల ధరల ప్రకటన వివరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఏఐటీయూసీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లాలో అన్ని గిడ్డంగుల వద్ద రెండు రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు హమాలీలు పేర్కొన్నారు. మత్స్య నారాయణరావు, భీమ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రాభివృద్ధికి కృషి



శ్రీముఖలింగంలో సిమెంటు రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మాడవీధుల్లో పురపాలక ఆదేశాలతో రూ.20 లక్షల ఉపాధిహామీ పథకం (మెటీరియల్ కాంపోనెంట్) నిధులతో సిమెంటు రహదారి నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి రోడ్డు పనులను శ్రీముఖలింగం నుంచి ప్రారంభించడం శుభపరిణామమని ఇంత కన్న మంచి ప్రభుత్వం ఉంటుందా అని అన్నారు. సర్పంచి తమ్మన్నగారి సతీష్‌కుమార్, స్థానిక తెదేపా నాయకులు తర్ర బలరాం, మెండ రాంబాబు, వెంటరమణదాస్, బగ్గు గోవిందరావు, వెలమల చంద్రభూషణరావు, తదితరులు పాల్గొన్నారు. ● శ్రీముఖలింగేశ్వరస్వామిని గురువారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దర్శించుకున్నారు. ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన పేర, గోత్ర నామాలతో స్వామికి ఏకవారాభిషేకం నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న అష్టగణపతులు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీవారాహి అమ్మవారిని దర్శించుకున్నారు. తెదేపా నాయకులు మెండ రాంబాబు, తర్ర బలరాం, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి ధ్యేయం కావాలి



గుమ్మపాడులో ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది

సారవకోట, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిశుభ్రత అందరి ధ్యేయం కావాలని తెదేపా మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ కోరారు. మండలంలోని గుమ్మపాడు, అక్కివలస గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం చైతన్య ప్రదర్శన నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూస్‌టుడే, పాతపట్నం



వరండాలోనే విద్యార్థులకు తరగతి నిర్వహణ

దశాబ్దాల చరిత్ర కలిగిన పాఠశాల ఇది. ఇందులో వందల మంది విద్యార్థులు అరకొర వసతుల మధ్య చదువులు కొనసాగిస్తున్నారు. ఇదే పాతపట్నం మండలం కొరసవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల. దీన్ని 1956లో నిర్మించారు. సమీప గ్రామాల ప్రజలకు విలువైన సేవలందించిన విద్యాలయంగా గుర్తింపు పొందింది. అప్పట్లో నిర్మించిన రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ అదనపు తరగతి గదుల నిర్మాణం లేకపోవడంతో షెడ్డు వరండాలోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితులు దాపురించాయి.

శిథిల గదులు... పట్టించుకోని అధికారులు

అవస్థల్లో విద్యార్థులు

10 గదుల్లోనే బోధన

గత ప్రభుత్వ హయాంలో సమీప పాఠశాలను విలీనం చేయడంలో 3, 4, 5 తరగతులను కూడా ఇందులో నిర్వహిస్తున్నారు. దీంతో మొత్తం 250 మంది విద్యార్థులు, 21 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు. వీరికి సుమారు 14 తరగతి గదులు ఉండగా కేవలం పది గదుల్లోనే పాఠాలు బోధిస్తున్నారు. గతంలో శిథిలావస్థకు గురైన పాఠశాల వరండాలో పలు మార్లు తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. అయిదేళ్ల కిందట పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదుల (పిల్లర్ల) స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. వందల మంది విద్యార్థులు ఉన్నా బడి రక్షణ గోడ కూడా పడిపోయింది.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

పాఠశాలలో సమస్యలపై ఉన్నతాధికారులకు తెలియజేశాం. అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు గతంలో ప్రతిపాదనలు చేశాం. అప్పుడు ప్రారంభించిన పనులు పునాదుల స్థాయిలో నిలిచిపోయాయి. ఉన్న గదుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. అదనపు గదుల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– బి.సింహాచలం, ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కొరసవాడ

ఉన్నత పాఠశాలలో సమస్యల తిష్ట

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని బుడితి ఉన్నత పాఠశాలలో సమస్యలు తిష్ఠ వేయడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి పాఠశాలలో 460 మంది విద్యార్థులు ఉండగా ఇందులో 250 వరకు విద్యార్థినులే. ఈ పాఠశాలకు గత ప్రభుత్వ హయాంలో మొదటి విడత నాడు-నేడులో రూ.30 లక్షల నిధులు మంజూరు కావడంతో బాలికల కోసం మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించారు. రెండేళ్ల కిందట వినియోగంలోకి తెచ్చారు. ఇక్కడి మరుగుదొడ్లకు సంబంధించి నిర్మించిన ట్యాంకు నుంచి నీరు బయటకు వెళ్లడానికి గొట్టాలు ఏర్పాటు చేయలేదు. ఏడాది కాలంలోనే ట్యాంకు నిండిపోయింది. దీంతో మరుగుదొడ్ల నుంచి దుర్వాసన వెలువడుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై హెచ్‌ఎం మాధవరావు స్పందిస్తూ పనులు చేపట్టడానికి నిధులు లేవని, ఏడాదిగా మరుగుదొడ్ల సమస్య ఉన్న మాట వాస్తవమేనని, సెప్టిక్ ట్యాంకు నుంచి నీరు బయటకు వెళ్లేలా ఇంజనీరింగ్ సిబ్బంది పైపులు ఏర్పాటు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని తెలిపారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.



పాఠశాలలో దుర్వాసన వెలువడుతున్న మరుగుదొడ్ల సముదాయం

అడుగడుగునా గోతులే..!



జలుమూరు నుంచి వెంకటాపురం, రామచంద్రాపురం, సుబ్రహ్మణ్యపురం మీదుగా బుడితి వరకు 2018లో రూ.1.80 కోట్ల నిధులతో రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 80 శాతం వరకు పనులు పూర్తిచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో రాళ్లు తేలి గోతులమయంగా మారింది. ఈ విషయమై పంచాయతీరాజ్‌శాఖ ఏఈ కె.శ్రీధర్ వద్ద ప్రస్తావించగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవతో ఉపాధిహామీ పథకం నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, జలుమూరు

ముంచెత్తిన వాన

నరసన్నపేటలో గురువారం భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. దాదాపు గంట కాలం పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. నరసన్నపేట ప్రధాన రహదారితో పాటు మార్కెట్ రోడ్డు, కోవెల వీధి, పసారు వీధి, ఆదివారపుపేట, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు కొద్ది సమయం అంతరాయం కలిగింది.

– న్యూస్‌టుడే, నరసన్నపేట



గుంతలతో చింత..



ఎల్ఎన్‌పేట మండలంలో ఏబీ రహదారిపై బొర్రంపేట కూడలి వద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇక్కడ పలు ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ జేఈ కిరణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి మరమ్మతులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

అల్లుకున్న నిర్లక్ష్యం

నరసన్నపేట మండలం లుకులాం శివారు రహదారికి ఆనుకొని ఉన్న విద్యుత్తు స్తంభానికి పనికిరాని మొక్కల తీగలు అల్లుకోవడంతో ప్రమాదకరంగా మారింది. అసలే వర్షాకాలమని, మొక్కలు, పొదలు విద్యుత్తు తీగల వరకు వ్యాపించక ముందే సంబంధిత అధికారులు వాటిని తొలగించి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి పనికిరాని మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు.



– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

మట్టిదారే దిక్కు..



కొత్తూరు మండలంలోని నివగాం కూడలి నుంచి పాతపాడు గ్రామానికి వెళ్లే గ్రామీణ రహదారి అధ్వానంగా మారింది. తెదేపా ప్రభుత్వ హయాంలో దీని నిర్మాణం చేపట్టినా పూర్తికాలేదు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణం పూర్తికి చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ స్పందిస్తూ రహదారి నిర్మాణం పూర్తికి తగిన చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు

పోషకాహారంతోనే ఆరోగ్యం



మెళియాపుట్టి: పెద్దపద్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవం

నరసన్నపేట గ్రామీణం, మెళియాపుట్టి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానికంగా లభ్యమయ్యే పోషక విలువలతో కూడిన ఆహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని, రక్తహీనత తదితర సమస్యల నుంచి బయటపడవచ్చని ఐసీడీఎస్ పీవో నాగమణి తెలిపారు. ముద్దాడపేటలో గురువారం జరిగిన కార్యక్రమంలో పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి వారితో పాటు బాలింతలకు పోషకాహార పదార్థాలను అందజేశారు. ● గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని గ్రామ పెద్ద మాల్తీ శ్రీధర్ అన్నారు. మెళియాపుట్టి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పోషకాహార మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు చైతన్యం కల్పించారు. పోషకాహార పదార్థాల ప్రదర్శన ఆకట్టుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. ● ఐసీడీఎస్ పీవో శోభారాణి టెక్కలిలోని మోదుగువలసలో నిర్వహించిన పోషకాహార మసోత్సవాల్లో ఆమె పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆహారంపై అవగాహన కల్పించారు.

నిర్వాసితులకు ప్యాకేజీలు వర్తింపజేయాలి



అచ్చనాపురం గిరిజనులతో మాట్లాడుతున్న ఆఫ్‌షోర్ ఈఈ రాజశేఖర్, తహసీల్దారు హనుమంతురావు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఆఫ్‌షోర్ జలాశయం నిర్మాణ పనుల్లో భాగంగా వరద కాలువకు సేకరించిన భూముల వారిని కూడా నిర్వాసితులుగానే గుర్తించి పరిహారాలు చెల్లించాలని అచ్చనాపురం గ్రామస్థులు డిమాండు చేశారు. గురువారం గ్రామాన్ని సందర్శించిన ఆఫ్‌షోర్ ఈఈ రాజశేఖర్, తహసీల్దార్ హనుమంతులను గ్రామస్థులు నిలదీసి సమస్యలు విన్నవించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఈఈ రాజశేఖర్ స్పందిస్తూ ఆర్.అండ్‌ఆర్. నిబంధనల మేరకు నిర్వాసిత గ్రామాలకే ప్యాకేజీలు ఉంటాయని.. వరద కాలువకు సంబంధించి భూసేకరణలో జిరాయితీ భూములకు పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. గ్రామస్థుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గిరిజన సంఘ నాయకులు వరహాల కృష్ణారావు, సవర చొక్కారావు, జెన్ని కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఏపీ గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగీశ రామకృష్ణ

హిరమండలం, న్యూస్‌టుడే: గోవుల సంరక్షణకు ఉద్యమించాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగీశ రామకృష్ణ అన్నారు. గురువారం హిరమండలం ప్రేమ సాయి వృద్ధాశ్రమంలో గోసంరక్షకులు కోరాడ వెంకటరమణ అధ్యక్షతన గోప్రేమికులు, గోసంరక్షకుల సమావేశం జరిగింది. హిరమండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గోవుల అక్రమ రవాణా జరుగుతుందని, దీనిని అరికట్టేందుకు గోశాల ఏర్పాటు చేయాలన్నారు. పాతపట్నం నియోజకవర్గ భాజపా ఇన్‌ఛార్జి సలాన శరత్‌కుమార్, జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు కూడా మాట్లాడారు. గోమాత చిత్రపటంతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు ఎ.అబ్బాయి, ఎస్.సాయిబాబా, బి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జలుమూరు, న్యూస్‌టుడే: కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి యు.చిన్నరాజులు అన్నారు. జలుమూరు మండలం కరవంజ పంచాయతీ మట్టవానిపేటలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. రోగులకు మందులు అందజేశారు. బావుల్లో క్లోరినేషన్ చేయించారు. ఏఎన్ఎం లక్ష్మీబాయ్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, హెల్త్ అసిస్టెంటు నాగేశ్వరరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా పూర్తి చేయండి

పోలాకి, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ఏఈ శంకరరావు అన్నారు. గురువారం పోలాకిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అనుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తి చేయకపోతే కేంద్రం అందజేస్తున్న నిధులు వెనక్కి తీసుకొనే అవకాశం ఉందన్నారు. మండలంలో 600 గృహాల నిర్మాణాలు పూర్తికావాల్సి ఉందన్నారు. ఈ నెల 28న 'మన ఇల్లు-మన ఊరు' ప్రతి సచివాలయంలో నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరామన్నారు. సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పోలాకి, న్యూస్‌టుడే: పల్లిపేట విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని 11కేవీ ఉర్జాం ఫీడర్‌కు సంబంధించి మరమ్మతులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరావు తెలిపారు. పల్లిపేట, ఉర్జాం, రాజారాంపురం, అంపలాం, మొగవిల్లిపేట, గంగివలస, అంబీరుపేట, చెల్లాయవలస, రేవంపలాం గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పనితీరుతోనే గుర్తింపు


టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగులకు పనితీరుతోనే గుర్తింపు లభిస్తుందని డివిజనల్ పంచాయతీ అధికారి ఇప్పిలి వెంకటరమణ అన్నారు. స్థానిక డీఎల్‌పీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేసి బదిలీపై పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తున్న ఎస్ఎస్‌కే శ్రీనివాసులును గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు.

తల్లిదండ్రుల సహకారం అవసరం

నందిగాం, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని మండలం లఖిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిలుకు కృష్ణారావు అన్నారు. పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఇంటి వద్ద టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేటట్లు చూడాలని ఆయన కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నందిగాం, న్యూస్‌టుడే: గురుపూజోత్సవం నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న మండలంలోని లఖిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు టి.ప్రసాదరావును గ్రామస్థులు, విద్యార్థులు గురువారం సత్కరించారు. మాజీ సర్పంచి మాదిన లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పాతపట్నంలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, అధికారులు, నాయకులు

పాతపట్నం, కొత్తూరు, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గురువారం మండలంలోని రౌతులక్ష్మీపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ● కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కొత్తూరు మండలంలోని ఇరపాడు గ్రామంలో సర్పంచి కొయిలాపు శ్రీనివాసరావు అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కరపత్రాలను ఇంటింటికీ అతికించారు.

● కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి, సంక్షేమం అమలవుతాయని భాజపా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జన్ని పరమేశ్వర్ అన్నారు. టెక్కలిలోని మేఘవరం పంచాయతీ సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో గ్రామసభలో పలు తీర్మానాలు చేశారు. నడుపూరు లక్ష్మీనారాయణ, చిట్టిబారిక లింగరాజు, రంకిడి నీలయ్య, శాసనపురి శ్రీను పాల్గొన్నారు. అదేవిధంగా టెక్కలిలోని రెడ్‌క్రాస్ వీధిలో డొంకాన రామకృష్ణ, మామిడి నారాయణరావు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.



టెక్కలి పట్టణం: మేఘవరంలో జరిగిన కార్యక్రమంలో కూటమి శ్రేణులు

వసతిగృహానికి మోక్షం



బుడితిలో వినియోగానికి సిద్ధమైన భవనం

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని బుడితి గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరడం, విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో 2018లో రద్దు చేశారు. అప్పటి తెదేపా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దీని స్థానంలో బాలికల వసతిగృహం నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదించడంతో 2018లో నబార్డు నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు గుత్తేదారు 2020లో పనులు పూర్తిచేయడంతో నిర్మాణ పనులకు సంబంధించి రూ.1.53 కోట్ల బిల్లుల చెల్లింపులు జరిగాయి. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ భవనాన్ని పట్టించుకోలేదు. నాటి నుంచి నిరుపయోగంగానే ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. విద్యుత్తు, ఇతర పనుల కోసం కొంత నిధులు మంజూరు చేయించడంతో వినియోగానికి సిద్ధమైంది. త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ విషయమై ఎంఈవో ఎం.వెంకటరమణ వద్ద ప్రస్తావించగా స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికల కోసం ఇక్కడి భవనాన్ని టైప్-4 వసతి గృహంగా వినియోగించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నిర్ణయించారని, త్వరలోనే ప్రారంభోత్సవం జరగుతుందన్నారు. ఈ భవనానికి ఎట్టకేలకు మోక్షం లభించనుండటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పూర్తయిన రాజగోపురం పనులు



కొత్తమ్మతల్లి ఆలయానికి చేరుకున్న రాజగోపురం కలశాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి దేవస్థానం సుందరీకరణ పనుల్లో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో అయిదంతస్థుల రాజగోపురం పనులు చేపట్టారు. మూడున్నరేళ్ల పాటు సాగిన పనులను ఎట్టకేలకు పూర్తిచేశారు. వచ్చే నెల 1 నుంచి మూడు రోజుల పాటు కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు హుటాహుటిన మరమ్మతు పనులు నిర్వహించారు. అదేవిధంగా రాజగోపురంపై అలంకరించేందుకు కలశాలను తణుకు సమీపంలో అజ్జవరం గ్రామం నుంచి ప్రత్యేకంగా అప్పటి గుత్తేదారు ఎన్.వి.వర్మ రప్పించారు. వీటిని ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ఆర్థిక సాయం అందజేత

హిరమండలం, న్యూస్‌టుడే: తమతో పాటు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 35 ఏళ్ల కిందట చదువుకున్న బాల్య మిత్రుడు వైశ్యరాజు సుదర్శన్‌కు స్నేహితులు గురువారం ఆర్థిక సాయం అందించారు. సుదర్శన్ అనారోగ్యానికి గురైనట్లు, వైద్య చికిత్సలు చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు స్నేహితులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారణాసి రాజారెడ్డి మాట్లాడుతూ సుదర్శన్ క్యాన్సర్‌తో బాధపడుతూ విశాఖపట్నంలో వైద్య చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. తను 1986-93 మధ్య హిరమండలంలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.52 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు.

ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలి

కొత్తూరు: విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గేదెల కృష్ణారావు, ఎస్సై అహ్మద్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు స్వాగతోత్సవం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రముఖులకు జాతరకు ఆహ్వానం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: వచ్చే నెల 1 నుంచి నిర్వహించనున్న కొత్తమ్మ తల్లి జాతర మహోత్సవాల ఆహ్వాన పత్రికలను గురువారం ప్రముఖులకు అందజేస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి ఆహ్వానం పలికారు. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ (విశాఖపట్నం) కె.సుజాతకు ఆహ్వాన పత్రికను అందజేశారు. పలువురు శాసనసభ్యులకు, న్యాయమూర్తులకు జాతర మహోత్సవ పత్రికలను ఈవో వాకచర్ల రాధాకృష్ణ అందజేశారు. విద్యాశాఖ సీఆర్పీ దేవాది కృష్ణారావు, తెదేపా నేత మంచాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ సుజాతకు కొత్తమ్మతల్లి జాతర ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈవో రాధాకృష్ణ తదితరులు

ఎట్టకేలకు అనుసంధాన రోడ్లకు మరమ్మతులు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: గడిచిన అయిదేళ్ల పాటు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ, మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న రహదారులు ఎట్టకేలకు మరమ్మతులకు నోచుకుంటున్నాయి. కోటబొమ్మాళి సంతోషిమాత ఆలయం మీదుగా పాకివలస, మంచాలపేట సమీపంలో జాతీయ రహదారిని కేవలం పది నిమిషాల్లో చేరుకునే రహదారికి మరమ్మతులు చేపడుతున్నారు.



కోటబొమ్మాళి- మంచాలపేట మార్గంలో పనులు

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: చిలకపాలెం, కొయ్యాం, ధర్మవరం విద్యుత్తు ఉపకేంద్రాల నిర్వహణ పనుల నిమిత్తం మండలంలో కొన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ ఎస్.బయన్నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, కొయ్యాం, కె.కె.నాయుడుపేట, డి.మత్స్యలేశం, కుప్పిలి, బడివానిపేట, నిమ్మవానిపేట, భగీరథపురం, పొన్నాడు, ముద్దాడ తదితర గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని సూచించారు.

తెరపై ఈనాడు

• కీర్తన: దేవర • కీర్తిక: దేవర • కిన్నెర సినీమాక్స్: దేవర • ఎస్వీసీ (రామలక్ష్మణ): దేవర • సూర్యమహల్: దేవర • సరస్వతి: దేవర • చంద్రమహల్: దేవర • మారుతి: దేవర

– న్యూస్‌టుడే, అరసవల్లి

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ మహేశ్వరరెడ్డి పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వివిధ పోలీసు స్టేషన్లు, ఏఆర్, ఇతర విభాగాల్లో పని చేస్తున్న 32 మంది పలు అంశాలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.




వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఇది మంచి ప్రభుత్వం..



లావేరు: బెజ్జిపురంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

బూర్జ, ఎచ్చెర్ల(లావేరు), పొందూరు గ్రామీణం, గార, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం బూర్జ మండలం పాలవలసలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ● కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజుల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుకెళ్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బెజ్జిపురం, జేఆర్ పురంలో గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో భాజపా జిల్లా కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి నిరంతర కృషి చేస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం తోణంగి పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు.



బూర్జ: పాలవలసలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



గార: తోణంగి పంచాయతీ గ్రామంలో ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రయాణం.. మహాదారుణం

బూర్జ, పొందూరు మండలాల పరిధిలో ప్రధాన రహదారితో పాటు గ్రామీణ మార్గాలు అధ్వానంగా తయారై నిర్లక్ష్యానికి నిలువెత్తు రూపాలుగా దర్శనమిస్తున్నాయి. గుంతలు పడి రాళ్లు తేలి.. ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఈ దారుల్లో ప్రయాణమంటే చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. వర్షం పడితే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటోందని వాపోతున్నారు. గత ఐదేళ్లలో ఈ రోడ్లకు మరమ్మతులు చేయించిన దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో చోదకులు గుంతల్ని తప్పించేందుకు ప్రయత్నించి ప్రమాదం కొనితెచ్చుకుంటున్నారు. ఇప్పటికే పలువురు మృత్యువాత పడటంతోపాటు గాయపడిన ఘటనలు కోకొల్లలు. – న్యూస్‌టుడే, బూర్జ, పొందూరు, గ్రామీణం

కల్వర్టు కుంగి..

పొందూరు మండలం లైదాం గ్రామం నుంచి సంతకవిటి మండలం సిరిపురం గ్రామం మధ్యలో ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయి దారుణంగా తయారైంది. పొందూరు నుంచి వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి దారుణంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి వీటిని బాగుచేయాలని కోరుతున్నారు.



బూర్జ: గుంతలతో దర్శనమిస్తోన్న గుత్తావల్లి రహదారి

అడుగడుగునా గుంతలు..

బూర్జ మండలంలోని పణుకుపర్త నుంచి అల్లెన వెళ్లే రహదారి ఐదేళ్లుగా కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. అల్లెన నుంచి పాలకొండ, గుత్తావల్లి రహదారుల్లో అధిక బరువుతో వెళ్తున్న ఇసుక లారీల రాకపోకలతో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. బూర్జ-లంకాం, అన్నంపేట, టీకేఆర్ రాజుపేట రహదారులు, ఉప్పినివలస సీపీఎస్ ప్రధాన మార్గం నుంచి నామాల లక్ష్మీపురం, అన్నంపేట గ్రామం వరకు ఉండే రోడ్లలో రాళ్లు పిక్కలు తేలి గుంతలమయంగా మారింది. సీపీఎస్ రహదారి లచ్చయ్యపేట కూడలి నుంచి ఓవీపేట ఆదర్శ పాఠశాల వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర గుంతలతో పాటు కంకర తేలింది. దీంతో సైకిళ్లతో వెళ్లే విద్యార్థులు జారిపడి గాయాలపాలవుతున్నారు. జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ ఎమ్మెల్యే దృష్టికి పలు గ్రామాల సభ్యులు విన్నవించారు.



పొందూరు: లైదాం నుంచి సిరిపురం వెళ్లే రహదారి ఇలా..

పనులు చేపట్టనున్నాం.. బూర్జ, పొందూరు మండలాల్లో రహదారుల అధ్వానంగా ఉన్న విషయం వాస్తవమే. వాటి అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. సంబంధిత విషయాలపై ఉన్నతాధికారులకు వివరించి త్వరితంగా పనులు చేపట్టనున్నాం.
– ఆంజనేయ నాయక్, జేఈ, రహదారి భవనాలశాఖ

నేడు విభిన్న ప్రతిభావంతులకు స్వాభిమాన్ గ్రీవెన్స్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్న స్వాభిమాన్ గ్రీవెన్స్‌ను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సహాయ సంచాయకురాలు కె.కవిత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల మూడో శుక్రవారం జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని ఈ నెల 27వ తేదీకి మార్పు చేశామని పేర్కొన్నారు.

విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రణస్థలం మండలం పాతర్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కిటికీ శ్లాబు కూలి విద్యార్థి మృతి చెందిన దుర్ఘటనపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్, డీఈవోకు ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. దీనిపై కమిషన్ తీవ్ర దిగ్భ్రాంతి చెందిందని పేర్కొన్నారు. ఈ తరహా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బడుల్లో భద్రతా చర్యలు చేపట్టడం..విద్యార్థులకు తగిన సూచనలు చేసి ఉంటే బాలుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి కావన్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన జిల్లాలోని అన్ని పాఠశాలలను పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సైన్సుకిట్ ప్రారంభం

పొందూరు: మండలంలోని తాణేం ప్రాథమికోన్నత పాఠశాలలో బెజ్జిపురం యూత్‌క్లబ్ అందించిన సైన్సుకిట్‌ను ఎంఈవో-2 పి.రాజారావు ప్రారంభించారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్లు



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ రమణ

శ్రీకాకుళం నగరం : మెప్మా ఆధ్వర్యంలో స్వయంశక్తి సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేయడం.. వాటిని విక్రయించడానికి వీలుగా శ్రీకాకుళం నగరం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో అర్బన్ మార్కెట్లు ఏర్పాటు చేశామని మెప్మా పీడీ ఎంవీ రమణ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని రైతుబజారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మెప్మా సిబ్బంది వెంకటరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు న్యాయ సేవలపై అవగాహన



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

గార, న్యూస్‌టుడే: మండల పరిధి అంపోలు వద్ద కేంద్ర కారాగారాన్ని గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా సందర్శించారు. పరిసరాలను పరిశీలించి ఖైదీలకు అందజేస్తున్న వసతులపై ఆరా తీశారు. సకాలంలో బెయిల్ మంజూరు, వైద్య సేవలు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందజేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి వారితో మాట్లాడారు. ఆయన వెంట న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, కారాగార సిబ్బంది ఉన్నారు.

మురుగు బాధలు తప్పవా..



గార మండలం సతివాడ పంచాయతీ గ్రామం ప్రధాన రహదారిలో ఇరువైపులా కాలువ నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో స్థానికులకు మురుగు సమస్య వెంటాడుతుంది. ఈ ప్రాంతంలో మురుగు సమస్యలు పరిష్కరించేందుకు గత ప్రభుత్వంలో కాలువ నిర్మాణాలకు చర్యలు చేపట్టి సమస్య ఉన్న ప్రాంతాల్లోని జనావాసాలకు నోటీసులు కూడా అందజేసారు. అయినప్పటికీ నిర్మాణాలు ఇంత వరకు పూర్తి కాలేదు. మురుగు నీరు రహదారిపై నిలుస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి తిరుమలరావు వద్ద ప్రస్తావించగా కొంత వరకు కాలువ నిర్మాణాలు చేపట్టాం, త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, గార

తాగునీరు పట్టుకునేదెలా?

ఆమదాలవలస మండలం అక్కులపేటలో తాగునీటి బోరు చుట్టూ ఎత్తైన దిమ్మెను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో కొత్తగా సీసీ రోడ్డు నిర్మించడంతో బోరు ఎత్తు తగ్గి రహదారిపై ఉన్న మురుగు నీరంతా దిగువకు చేరుతుంది. దీంతో తాగునీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. పరిశీలించి తక్షణమే చర్యలు చేపడతామని పంచాయతీ విస్తరణ అధికారి గోవిందరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం



ముళ్ల పొదలతో ప్రమాదం



ఆమదాలవలస పట్టణంలోని గేటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై ముళ్ల పొదలు పక్కకు ఒరిగిపోయి ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం శ్రీకాకుళం రోడ్డు రైలునిలయానికి వెళ్లే వాహనాదారులకు ముఖ్యంగా రాత్రి సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. సమీపంలోనే మలుపు ఉండటంతో ఎదురుగా వచ్చిన వాహనాలను గుర్తించలేక స్థానికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై పురపాలక కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్‌ను వివరణ కొరగా పరిశీలించి.. వాటిని తొలించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

నదీ జలాలు కలుషితం కాకుండా సహకారం



నాగావళి నది ఒడ్డున స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో.. ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

శ్రీకాకుళం నగరం, గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో నాగావళి, వంశధార నదీ జలాలు కలుషితమవకుండా అందరూ సహకరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద రివర్ వ్యూ పార్కు ప్రాంతంలో నాగావళి నది తీర ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఉద్యానంలో మొక్కలు నాటారు. నగర ప్రజలు ఇళ్లలో చెత్తను వ్యర్థాల సేకరణకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసి స్వచ్ఛ శ్రీకాకుళం సాకారానికి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు పాల్గొన్నారు.

నీట మునిగిన రహదారులు

శ్రీకాకుళం నగరం, ఆమదాలవలస మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రహదారులు నీట మునిగాయి. నగరంలో ఇల్లీసుపురం వద్ద రైతు బజార్ కూడలి, సానా వీధి, పొట్టి శ్రీరాములు కూడలి, గుజరాతీపేటలో కూరగాయలు టోకుగా విక్రయించే ప్రాంతం, కృష్ణా పార్కు వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. వాహనదారులు, నడిచి వెళ్లే వారు ఇబ్బంది పడ్డారు.
–న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం, ఆమదాలవలస గ్రామీణం,



శ్రీకాకుళం నగరం రెల్ల వీధిలో నిలిచిన మురుగు



సానా వీధి మార్గంలో ఇలా..

కూలి ధరల ఒప్పంద జీవో విడుదల చేయాలి



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న హమాలీలు

ఎచ్చెర్ల(లావేరు), న్యూస్‌టుడే: పౌరసరఫరాల గోదాంల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల కూలీ ధరల జీవో వెంటనే విడుదల చేయాలని కోరుతూ లావేరు గోదాం వద్ద కార్మికులు గురువారం కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. రెక్కల కష్టానికి తగ్గ కూలీరేట్లు ప్రభుత్వం అందించక కుటుంబాలతో అర్ధాకలితో అలమటిస్తున్నమనీ, ప్రతి నెలా 20వ తేదీకి ఇస్తున్న బిల్లులు పదో తేదీకి అందజేయాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల కుదింపు ఆపి పాత విధానంలో సరకుల రవాణా చేయాలన్నారు. హమాలీలు గంగి గౌరి, పసుపురెడ్డి బుజంగరావు, జగది, బారుకుల శంకరరావు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

ముంపు బారిన పడకుండా చర్యలు

శ్రీకాకుళం నగరం: భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు.

విలీనాన్ని తక్షణమే రద్దు చేయాలి

జి.సిగడాం: ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల విలీనాన్ని తక్షణమే రద్దు చేయాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు తమ్మినైన సన్యాశిరావు తెలిపారు. జి.సిగడాం మండలంలో ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకునేందుకు పలు పాఠశాలలను ఆయన సందర్శించారు.

అలరించిన స్వర నీరాజనం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: పాలకొండ రోడ్డు బాపూజీ కళా మందిరంలో గురువారం సిక్కోలు ఫ్యూచర్ సింగర్స్ ఆధ్వర్యంలో గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వరనీరాజనం, పాటల పోటీలు నిర్వహించారు. కె.మధుకుమార్, సీహెచ్ సాయిబాబా పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో బాలు విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. 40 మంది గాయకులు పాటలు ఆలపించారు. ఉదయం జరిగిన సభలో విశ్రాంత అధికారి వావిలపల్లి జగన్నాథం నాయుడు, లయన్స్ క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపకుడు హరికాప్రసాద్, మణిశర్మ, ఉషారాణి, తొత్తడి మణికంత, సాయంత్రం నిర్వహించిన సభలో డీఎస్పీ వివేకానంద పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



ఆదిత్యుని సేవలో మాధవపెద్ది సురేష్

శ్రీకాకుళం నగరం: అరసవల్లిలో సూర్యనారాయణస్వామి ఆలయాన్ని గురువారం సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ దంపతులు సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో అర్చకులు వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు.

ఫైనాన్స్ అంశాలపై సమీక్ష

కలెక్టరేట్(శ్రీకాకుళం): శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఫైనాన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.బి.సుజాత హాజరయ్యారు. వివిధ ఫైనాన్స్ అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపల్ శంకరనారాయణ పాల్గొన్నారు.

పశువుల దాణాను సద్వినియోగం చేసుకోండి

సరుబుజ్జిలి: పాడి రైతులకు ప్రభుత్వ రాయితీపై పంపిణీ చేస్తున్న పశువుల దాణాను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర తెదేపా రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ అన్నారు. షళంత్రి గ్రామీణ పశువైద్య కేంద్రంలో రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణాల సమాచారం పక్కాగా ఉండాలి

జి.సిగడాం: గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరు, నిర్మాణాల దశలకు సంబంధించి పూర్తి సమాచారం పక్కాగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. జి.సిగడాం మండల పరిషత్తు కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

ఆలయాల్లో పూజలు చేయండి..

ఆమదాలవలస పట్టణం: జిల్లాలోని అన్ని ఆలయాల్లో ఈ నెల 28వ తేదీన ప్రత్యేక పూజలు చేయాలని వైకాపా జిల్లా పార్లమెంటరీ పరిశీలకుడు తమ్మినేని సీతారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎచ్చెర్ల(లావేరు): వెంకటాపురం జడ్పీఉన్నత పాఠశాలలో ఆయాగా పని చేస్తున్న ఇప్పిలి మంగమ్మ ఇటీవల మృతిచెందారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఒప్పంద ఉద్యోగులంతా ఎంఈవో-2 మురళీకృష్ణ కలిసి ఆమె కుటుంబానికి రూ.38వేలసాయాన్ని అందజేశారు.

కేంద్ర కారాగారానికి టీవీల వితరణ

గార, న్యూస్‌టుడే: అంపోలు సమీపంలోని కేంద్ర కారాగారంలో ఖైదీలు వీక్షించడానికి రెండు టీవీలను గురువారం శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి కీర్తిపట్నాయక్ (విశాఖ) కారాగారం సూపరింటెండెంట్ సన్యాసిరావుకు అందజేశారు. దివంగత డాక్టర్ కుప్పిలి త్రినాథరావు పట్నాయక్ పేరిట ఇచ్చామని ఆమె తెలిపారు. జైలర్ ఉదయభాస్కర్, డిప్యూటీ జైలర్ రామకృష్ణ, లక్ష్మణరావు, జిల్లా ఇస్కాన్ సభ్యుడు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

కలెక్టరేట్ (శ్రీకాకుళం): ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా 7వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి కోరారు. అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పొందూరు విద్యార్థినులు



శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పొందూరు మండలం లోలుగు కస్తూర్బా పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగం షాట్‌పుట్‌లో డి.హాసిని మొదటి స్థానం, అండర్-17 విభాగం డిస్కస్‌త్రోలో కె.జానకి మూడోస్థానం, అండర్-17 విభాగంలో షాట్‌పుట్, డిస్కస్‌త్రోలలో ఎం.ద్రాక్ష మొదటి స్థానంలో నిలిచినట్లు గురువారం పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.రూపావతి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. – న్యూస్‌టుడే, పొందూరు

ఇంట్లో చోరీకి యత్నం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న ఓ మహిళ ఇంట్లోకి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి యత్నించారు. తలుపులు బద్ధలుగొట్టి లోపలికి వెళ్లిన వారికి ఏమీ లభ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. ఇంటి యజమాని సత్యసాయి భక్తురాలు. ఉద్యోగరీత్యాబయట ప్రాంతంలో ఉన్న కుమారుల వద్దకు ఆమె వెళ్లారు. ఘటనా స్థలంలో ఏ సామగ్రి పోలేదని ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన



శ్రీకాకుళం నగరంలోని విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ కేంద్రంలో గురువారం జీబీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 20 మంది రక్తదానం చేశారని నిర్వాహకురాలు భాగ్యలక్ష్మి తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)